ఏదో అందరూ ఎంగిలిపడి లేచారు. మధూ, జయా, పిల్లలు ఎవరి ధోరణిలో వాళ్ళున్నారు. కానీ, అభిమానంగా పలకరించేవాళ్ళే కరువయ్యారు.

ఏడ్చి ఏడ్చి అలసిపోయిన సునీతి, ఏదో నిర్ణయంకొచ్చినదానిలా లేచి మొహం కడుక్కుని బట్టలు మార్చుకుని తయారైంది.

"ఎక్కడికి, ప్రహ్లాద్ దగ్గరికేనా?" కటువుగా వుంది మధు కంఠం.

"అవును." నిశ్చలంగా అంది సునీతి.

"ఎందుకు?"

ఒక్క నిమిషం ఏమి చెప్పాలో తెలీలేదు.

"మనశ్శాంతి కోసం" అంది.

"అదిక్కడలేదా?''

"లేదు గనుకనే'' అంటూ సమాధానం కోసం ఎదురుచూడకుండా వెళ్ళిపోయింది సునీతి.

జరిగినదంతా విని ఎంతో బాధపడ్డాడు ప్రహ్లాద్.

"సీతీ, ఇప్పటికయినా మించిపోయిందిలేదు. మనం పెళ్ళి చేసుకుందాం. నిన్ను నాదాన్ని చేసుకుని ఎవ్వరూ నోరెత్తకుండా చేస్తాను'' అన్నాడు ప్రహ్లాద్.

"ప్రదా! ఈ వయస్సులో పెళ్ళిచేసుకుంటే నవ్వుతారేమో?'' అమాయకంగా అంది సునీతి.

ప్రహ్లాద్ పకపకా నవ్వాడు. "సీతీ, వయస్సు పెరుగుతుంటేనే తోడు అవసరం. యౌవనంలో తోడుకంటే ఉద్రేకం ఎక్కువ. అయినా నీకు నలభై దాటినా, పెళ్ళిచేసుకోడానికి నేను సిద్ధపడ్డాక ఎవరో నవ్వితే మనకేం?''

సునీతి మనస్సు ఆనందంతో తేలిపోయింది. ప్రహ్లాద్ దేముడిలా అనిపించాడు. వేరే పరమార్థం లేదనుకుంది. పైగా తను ఎవరికోసం త్యాగం చెయ్యాలి? అనిపించింది. వెంటనే "సరే'' అంది.

ప్రహ్లాద్ ఉబ్బితబ్బిబ్బయ్యాడు. ఆ నిమిషంలో రెండు మనసులూ ఏకమై ఆనందంలో తేలిపోయాయి.

రిజిష్ట్రారు ఆఫీసరుకి ప్రహ్లాద్ సునీతి నోటీసిచ్చారని మధూ ద్వారా తెలుసుకున్న రవి సునీతికి లాయర్ నోటీసు పంపించాడు.

